# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం
29 జులై 2026


## బెల్ట్ షాపులలో జోరుగా
# ఏరులై పారుతున్న అక్రమ మద్యం

**మండల కేంద్రంలో అధికారికంగా వైన్ షాప్ అందుబాటులో ఉన్నప్పటికీ అక్రమ బెల్ట్ షాపుల దందా యథేచ్ఛగా కొనసాగుతోందనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రంలోనే 30 కి పైగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. అంతేకాకుండా మండల పరిధిలో సుమారు 53 గ్రామాలు ఉండగా దాదాపు 40 గ్రామలలో ఒకటి లేదా రెండు బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జోరుగా జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.**



**గుండాల,జూలై 28 (నినాదం):**
వైన్ షాపుల నుంచి మద్యం తీసుకువచ్చి గ్రామాల్లోని అనధికారిక దుకాణాల ద్వారా ప్రభుత్వ అనుమతి లేకుండానే విక్రయిస్తున్నట్లు వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరల కంటే రూ. 50 నుండి 60 అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ వినియోగదారుల నుంచి అదనపు డబ్బులు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ అక్రమ విక్రయాలు మరింత జోరుగా సాగుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా బెల్ట్ షాపులు బహిరంగంగానే కొనసాగుతున్నప్పటికీ సంబంధిత ఎక్సైజ్ శాఖ కానీ మండల అధికారులు కానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్సైజ్ శాఖతో పాటు మండల సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించడంలో విఫలమవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మద్యం విక్రయాల వల్ల అధిక ధరలతో ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని, ఈ సమస్య కేవలం అక్రమ విక్రయాలతో మాత్రమే పరిమితం కావడం లేదని, గ్రామాల్లో సులభంగా మద్యం అందుబాటులో ఉండటంతో యువత వేగంగా వ్యసనానికి బానిసలవుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకప్పుడు మద్యం కోసం వైన్ షాప్‌కు వెళ్లాల్సిన మద్యం ప్రియులు ఇప్పుడు గ్రామంలోని బెల్ట్ షాపులోనే దొరుకుతుండటంతో మద్యం వినియోగం మరింత పెరుగుతోందని స్థానికులు వాపోతున్నారు.
మద్యం తాగే వ్యక్తికి అది ఒక అలవాటుగా కనిపించవచ్చు. కానీ ఆ వ్యసనం మూల్యం చెల్లించేది మాత్రం కుటుంబం. ప్రతి రోజు ఈ రోజైనా మారతారేమో అనే ఆశతో ఎదురుచూసే భార్య, భయంతో పెరిగే పిల్లలు, కన్నీళ్లతో రోజులు గడిపే తల్లిదండ్రులు, ఆర్థిక ఇబ్బందులతో కృంగిపోయే కుటుంబాలు... ఇవన్నీ మద్యం వ్యసనం వెనుక దాగి ఉన్న చేదు వాస్తవాలు. మద్యం కేవలం డబ్బును మాత్రమే కాదు కుటుంబ ప్రశాంతతను, పరస్పర నమ్మకాన్ని, పిల్లల భవిష్యత్తును కూడా నెమ్మదిగా కబళిస్తోంది. పిల్లల చదువు, వైద్యం, కుటుంబ అవసరాలకు ఖర్చు కావాల్సిన డబ్బు వ్యసనంలో కరిగిపోతోంది. అప్పులు పెరిగి కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతున్నాయి. భార్యలు ప్రతిరోజూ భయంతో జీవిస్తుంటే, పిల్లలు బాల్యంలోనే మానసిక ఒత్తిడిని అనుభవిస్తున్నారు. సామాజికంగా కూడా ఈ పరిస్థితి తీవ్ర ప్రభావం చూపుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించి, మద్యం అక్రమ విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రంలో అధికారిక వైన్ షాప్ ఉండి కూడా గుండాలలోనే 30 కి పైగా, మండలంలోని సుమారు 40 గ్రామాల్లో ఒక్కో గ్రామానికి ఒకటి లేదా రెండు బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు మద్యం వ్యసనాన్ని తగ్గించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో
# గాంధీనగర్ గ్రామసభ


**ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి..**
**ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించాలి**



**హుస్నాబాద్ జూలై 28 (నినాదం);**
హుస్నాబాద్ మండలంలోని గాంధీనగర్ గ్రామంలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గ్రామసభ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ మండల ఎంపీడీవో సురేష్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని, ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగిస్తూ నీటి వృథాను అరికట్టాలని కోరారు. భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడు గుంతల నిర్మాణం ఎంతో అవసరమని, గ్రామాల్లో నీటి సంరక్షణ చర్యలను మరింత విస్తృతంగా చేపట్టాలని సూచించారు.గ్రామ సర్పంచ్ పోలు సంపత్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నాయని అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేస్తే నష్టాలను తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నీటిని వృథా చేయకుండా ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని, భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్న సాగు విధానాలను రైతులు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి పరామర్శల వెల్లువ

**యశోద ఆసుపత్రిలో కుటుంబ సభ్యులను కలిసి మనోధైర్యం చెప్పిన నల్లబెల్లి మండల ప్రజాప్రతినిధులు, నాయకులు**



**నల్లబెల్లి,జూలై 28(నినాదం):**
అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని మంగళవారం నల్లబెల్లి మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు,నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకుని ప్రజా జీవితంలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు.ఆసుపత్రిలో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నను కలిసి నాయకులు మనోధైర్యం చెప్పారు. అత్యుత్తమ వైద్య సేవలు అందుతున్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పెద్ది సుదర్శన్‌రెడ్డి త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు పార్టీ శ్రేణులు, అభిమానులు అండగా ఉంటారని భరోసా కల్పించారు.నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి పెద్ది సుదర్శన్‌రెడ్డి అందించిన సేవలను నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రజలతో సన్నిహితంగా మమేకమై పనిచేసిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఆయన త్వరగా కోలుకుని మళ్లీ ప్రజల మధ్య చురుకుగా సేవలందించాలని ఆకాంక్షిస్తూ పలువురు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఊడుగుల సునీత–ప్రవీణ్ గౌడ్, మాజీ వైస్



ఎంపీపీ గందే శ్రీలత–శ్రీనివాస్ గుప్తా, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పులి రమేశ్, నారక్కపేట సర్పంచ్ సంపత్, మేడపల్లి సర్పంచ్ సాంబయ్య, రాంపూర్ సర్పంచ్ భాస్కర్, నాయకులు కోనకటి లింగారెడ్డి, అల్లె రజినీకాంత్, సాక్షి విలేఖరి సాంబయ్య, వ్యాపారవేత్త అల్లం శౌరెడ్డి తదితరులు పాల్గొని మాజీ ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలనిఆకాంక్షించారు.





## సైబర్ నేరాల నివారణకు
# అవగాహనే ఆయుధం

**పేకాట.. బెట్టింగ్‌పై ఉక్కుపాదం**

**సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

**వెల్దుర్తి స్టేషన్‌లో అదనపు ఎస్పీ ఆకస్మిక తనిఖీ**

**వెల్దుర్తి, జులై 28 (నినాదం):**
ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, సూచించారు. మంగళవారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, వివిధ రిజిస్టర్లు, కేసు డైరీలు, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. ఆయా కేసుల దర్యాప్తు పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐ కర్ణాకర్‌రెడ్డికి సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణ, లాకప్ గదులు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందితో సమావేశమై స్థానిక శాంతిభద్రతల పరిస్థితిపై సమీక్షించారు. నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పేకాట, ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని అదనపు ఎస్పీ ఆదేశించారు. నిర్వాహకులతో పాటు వాటిలో పాల్గొనే వారిపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని, సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ, దర్యాప్తులో కీలక ప్రయోజనం ఉంటుందని, వాటి ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని సత్వరమే స్పందించాలని అదనపు ఎస్పీ సూచించారు. ప్రతి ఫిర్యాదుపై పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా విధులు నిర్వహించాలని సూచించారు.

## ముల‌కలపల్లి పీఏసిఎస్
# అందుబాటులో ఉంచాలి

**రైతు సంఘం డివిజన్ కార్యదర్శి నకరికంటి నాగేశ్వరరావు**

**ములకలపల్లి, జూలై 28 (నినాదం):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలంలోని పీ ఏ సీ ఎస్ కేంద్రంలో యూరియా ఎరువు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సంఘం డివిజన్ కార్యదర్శి నకరికంటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక రైతులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. వాతావరణ నిపుణులు ఎల్‌నినో ప్రభావం వల్ల కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉందని చెబుతున్న నేపథ్యంలో, రైతులు పంటలను కాపాడుకునేందుకు అవసరమైన ఎరువులు సకాలంలో అందడం ఎంతో కీలకమని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పి ఏ సి ఎస్ కేంద్రంలో యూరియా నిల్వలు లేకపోవడం రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. యూరియా కోసం రైతులు కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు అధికారులు వెంటనే స్పందించి ములకలపల్లి పీహెచ్ కేంద్రానికి తగినంత యూరియాను సరఫరా చేసి రైతులకు అందుబాటులో ఉంచాలని నకరికంటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. వర్షాల కొరతతో పాటు ఎరువుల కొరత కూడా రైతులను నష్టపరచకుండా ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.





## ఓటర్ల జాబితా సవరణలో
# బూత్ స్థాయి బాధ్యులు కీలక పాత్ర పోషించాలి

**హుస్నాబాద్ జులై 28 (నినాదం)**
భారతీయ జనతా పార్టీ అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల పర్యటన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు, మాజీ సెన్సార్ బోర్డు సభ్యుడు లక్కిరెడ్డి తిరుమల రెడ్డి అక్కన్నపేట మండలంలోని పలు బూత్‌లను సందర్శించి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ స్థాయి బాధ్యులు, బూత్ అధ్యక్షులు అత్యంత కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఇప్పటికే 93 శాతం వరకు నమోదు ప్రక్రియ పూర్తయినందున మిగిలిన ప్రక్రియను కూడా వంద శాతం పూర్తి చేసే వరకు ప్రతి బూత్ స్థాయి బాధ్యుడు, బూత్ అధ్యక్షుడు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. అలాగే తుది ఓటర్ల జాబితా విడుదలయ్యే వరకు ప్రతి ఓటరు వివరాలను నిశితంగా పరిశీలిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, మండల ఉపాధ్యక్షులు జగదీశ్ చారి, అర్జున్ నాయక్, మండల కార్యదర్శి కళ్యాణ్ విష్ణు, వివిధ మోర్చాల అధ్యక్షులు కుంట స్వప్న, సాలేంద్ర తిరుపతి, గిరిమల్ల రాజు, గంగుల కుమార్, రవీంద్ర చారి, కొండే సంజీవ రెడ్డి, కట్కూర్ ప్రభాకర్ రెడ్డి, బొంకూరి పోలో, రజనీకాంత్, దారణ రాజు, జిల్లా కనకయ్య, శ్రీనివాస్ రెడ్డి, వేముగంటి తేజ, వద్లూరి సృజన్ తదితర భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ రంగ కార్మికులు బిఓసి కార్డును రెన్యువల్ టైంకు ముందే రెన్యువల్ చెయించుకోవాలి: ఐఎన్ టియూసి

**నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య**

**హుజూర్ నగర్, జూలై 28 (నినాదం)**
కార్మికులకు అండగా ఐఎన్టియుసి ఎల్లవేళలా అండగా నిలుస్తుందని హుజూర్ నగర్ నియోజకవర్గ ఐఎన్టియుసి అధ్యక్షులు బెల్లంకొండ గురవయ్య గౌడ్ అన్నారు. మంగళవారం హుజూర్ నగర్ పట్టణం లోని ఐ ఎన్ టి యు సి అనుబంధ సంఘమైన పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు రాచకొండ రాము ఇటీవలే బైక్ ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు కాగా ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఐఎన్టియుసి నాయకులు ఆయన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగం లో పనిచేస్తున్న కార్మికులు బిల్డింగ్ అధర్ కన్స్ట్రక్షన్ (బి వో సి ) కార్డు కలిగిన కార్మికులు సకాలంలో రెన్యూవల్ చెయించుకోవాలన్నారుబివో సి కార్డు రాచకొండ రాము రెన్యువల్ చెయించుకోపోవడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే ఇన్స్యూరెన్స్ సహాయం నిలిచిపోయింది. బి ఓ సి కార్డు రెన్యువల్ విషయంలో కార్మికులు జాప్యం చెయ్యవద్దు అని అన్నారు. కార్డు ఉండటం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. సకాలంలో రెన్యూవల్ చెయించకుంటే ఏదైనా అనుకోకుండా జరిగితే కుటుంబాలు నష్టపోతాయి ఇన్స్యూరెన్స్ క్లెయిమ్ కాదు అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యూ సి మండల అధ్యక్షులు మేళ్ళచేరువు ముక్కంటి, జిల్లా నాయకులు చింతకాయల రాము,సరస్వతి తదితరులు పాల్గొన్నారు.





## ఆగస్టులో..ఒకేసారి మూడు నెలల బియ్యం

**నూతనకల్,జూలై 28 (నినాదం):**
రేషన్ లబ్ధిదారులకు మరోసారి మూడు నెలల బియ్యం ముందుగానే అందనుంది గడిచిన ఏప్రిల్,మే,జూన్ నెలలకు సంబంధించిన బియ్యం ఒకేసారి అందించగా తాజాగా మరోసారి ఈ విధానంలోనే పంపిణీ చేసేందుకు జిల్లా పౌరసరఫరల శాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు ఆయా మండల అధికారులకు ఉత్తర్వులు జారీచేశారు.దీంతో కసరత్తు ప్రారంభించారు. ఆగస్టు,సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించిన బియ్యాన్ని వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఒకేసారి సరఫరా చేయనున్నారు.ఒకేసారి పెద్ద మొత్తంలో బియ్యం పంపిణీ చేయాల్సి ఉండడంతో అధికారులు ప్రత్యేక రవాణా ఏర్పాటు చేస్తున్నారు.





# సబ్సిడీ విత్తనాలతో రైతులను ఆదుకోవాలి

**రైతు వేదిక ముందు బీజేపీ ధర్నా... సమాచారం సామాజిక మాధ్యమాలలో కాకుండా గ్రామాలలో చాటింపు కూడా వేయాలి.. బిజెపి మండల అధక్షుడు రామంచ మహేందర్ రెడ్డి డిమాండ్**

**హుస్నాబాద్ జులై 28( నినాదం):-**
అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదిక ముందు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి నాయకత్వంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వానాకాలం సాగు సీజన్‌లో రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలను తగినంతగా అందుబాటులో ఉంచడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. విత్తనాల కొరత కారణంగా రైతులు అధిక ధరలకు ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోందని, దీంతో సాగు వ్యయం పెరిగి రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. రైతులకు నాణ్యమైన సబ్సిడీ విత్తనాలను సకాలంలో అందించాలని డిమాండ్ చేసిన ఆయన, రైతులకు సంబంధించిన ప్రభుత్వ సమాచారం, సబ్సిడీ విత్తనాల పంపిణీ వివరాలు, వ్యవసాయ పథకాల సమాచారాన్ని కేవలం వాట్సాప్ గ్రూపుల ద్వారా పంపించడం వల్ల అందరు రైతులకు చేరడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్లు లేని రైతులు ప్రభుత్వ సమాచారానికి దూరమవుతున్నారని తెలిపారు. అందువల్ల రైతులకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని గ్రామాల్లో డప్పు చాటింపు ద్వారా తెలియజేసేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వం స్పందించకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రైతుల తరఫున ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లక్కిరెడ్డి తిరుమల, మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, ఉపాధ్యక్షుడు జయదేశ్వరాచారి, కుంట స్వప్న, గంగుల కుమార్, సలేంధ్ర తిరుపతి, గిరిమల్ల రాజు, దార్న రాజు, కొండ్ల సంజీవరెడ్డి, బొంకూర్ రజనీకాంత్, కట్కూర్ ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వేముగంటి తేజ, వద్లూరి సృజన్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ పేరుతో మొక్కను నాటి- అమ్మ ప్రేమను భవిష్యత్తును కాపాడుదాం

**ప్రకృతిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత**
**ప్రధానోపాధ్యాయులు శంకర్ నాయక్**

**హుజుర్నగర్ (మట్టంపల్లి) జూలై 28( నినాదం ):**
పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సంరక్షణపై విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన అవగాహన పెంపొందించేందుకు తెలంగాణ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అమ్మ పేరుతో ఒక మొక్క" కార్యక్రమాన్ని తెలంగాణ మోడల్ స్కూల్, మట్టంపల్లిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటడంతో పాటు



సీడ్ బాల్స్ తయారీ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షిస్తూ హరిత తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో గ్రీన్ టీచర్ (నోడల్ టీచర్) నియామక ప్రక్రియను చేపట్టి, ఏడాది పొడవునా పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శంకర్ నాయక్ మాట్లాడుతూ, ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. నేడు మనం నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు అమూల్యమైన సంపద. విద్యార్థులు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి హరిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

బుధవారం, తెలంగాణ
29 జులై 2026
# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

### ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ధర్నా




**యాదాద్రి భువనగిరి, జూలై 28(నినాదం):** కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేలు హామీని వెంటనే అమలు చేసి రాష్ట్రంలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా రవాణా శాఖ (డీటీఓ) కార్యాలయం ముందు ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేసి డీ. టీ. ఓ నరేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు కుటుంబ పోషణ కోసం తీవ్ర కష్టాలు పడుతున్నారని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, విడిభాగాల ధరల పెరుగుదల, బ్యాంకు రుణాల భారం, రోజురోజుకూ తగ్గుతున్న ఆదాయంతో ఆటో కార్మికుల జీవనం సంక్షోభంలోకి నెట్టి వేయ బడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆటో, రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను పెంచాలని, ఓలా, ఉబెర్, ర్యాపిడో వంటి యాప్ సంస్థల కారణంగా సంప్రదాయ ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్న నేపథ్యంలో వాటిని నియంత్రిస్తూ ఆటో కార్మికుల ప్రయోజనాలను కాపాడే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామల శోభన్ బాబు, వెంకటేష్, భాస్కర్, కృష్ణ, వెంకటేష్, కొత్త కృష్ణ, జ్ఞానేశ్వర్, లింగాల నరసింహ, ప్రభాకర్, జాహేద్, చాంద్, పద్మయ్య, సురేష్, కృష్ణంరాజు, అంజయ్య, రాములు, రామాంజనేయులు, రజ్జాబ్ అలీ, వెంకటేష్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాగునీరు ఇవ్వకుంటే ఆమరణ దీక్ష... ప్రాణత్యాగానికైనా సిద్ధం

బొల్లం మల్లయ్య యాదవ్
వారం రోజుల్లో చెరువులు నింపాలని డిమాండ్
ఎల్‌నినోపై ముందస్తు చర్యల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శ
రైతుల హక్కుల కోసం పోరాటం
మరింత ఉధృతం చేస్తామని స్పష్టం





**కోదాడ, జూలై 28(నినాదం):** అనంతగిరి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై మంగళవారం మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని రైతులతో రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. గత కొన్ని నెలలుగా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంలోనూ, సాగునీటి ప్రణాళిక అమలులోనూ నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుంచి విడుదల చేసిన నీటితో ముందుగా కోదాడ నియోజకవర్గంలోని చెరువులను నింపాల్సి ఉండగా, వాటిని విస్మరించి ఇతర ప్రాంతాలకు నీటిని తరలించారని ఆరోపించారు. దీంతో కోదాడ రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రజలకు తాగునీటి సమస్య కూడా ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితికి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా కోదాడ నియోజకవర్గంలోని చెరువులను నింపి రైతులకు సాగునీరు అందించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉంటానని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. . బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నల్ల భూపాల్ రెడ్డి, అధ్యక్షతన జరిగిన ఈ నిరసనలు ప్రధాన కార్యదర్శి గూగులోతు శ్రీనివాస్ నాయక్, నాయకులు మట్టపల్లి సైదులు, ఐతనబోయిన వెంకటేశ్వర్లు, పందిరి వీరయ్య, అఫ్జల్ పాల్గొన్నారు.

### గ్రామాలకు నిధులు ఇవ్వకుండా అభివృద్ధి సమీక్ష సమావేశాలు నిర్వహించడం విడ్డూరం

పాతూరి వెంకటస్వామి గౌడ్

దుబ్బాక అభివృద్ధిపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలి



**దుబ్బాక, జూలై 28(నినాదం):** గ్రామాల అభివృద్ధికి చిల్లిగవ్వ కూడా కేటాయించకుండా అభివృద్ధి సమీక్ష సమావేశాలు నిర్వహించడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమేనని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామి గౌడ్ విమర్శించారు. అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి పేరుతో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కొత్త డ్రామాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులుగా వచ్చిన కొండా సురేఖ, గడ్డం వివేక్ వెంకటస్వామిల సమక్షంలో నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కోరాల్సింది పోయి, కేవలం ప్రోటోకాల్ అంశాన్నే వివాదాస్పదం చేశారని విమర్శించారు. మెదక్ ఎంపీగా పనిచేసిన కాలంలో దుబ్బాక నియోజకవర్గానికి ఎంత మేరకు నిధులు తీసుకొచ్చారో ప్రజలకు వివరించేందుకు సిద్ధమా అని ఆయన ప్రశ్నించారు. ఎంపీగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ దుబ్బాక అభివృద్ధికి చెప్పుకోదగ్గ కృషి చేయలేదని ఆరోపించారు. ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా అభివృద్ధి పేరుతో కొత్త కొత్త ప్రకటనలు, కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రయోజనం లేదని పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గ ప్రజలు అన్ని పరిణామాలను గమనిస్తున్నారని, ఇకనైనా ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులపై దృష్టిసారించాలని ఎమ్మెల్యేకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పాటు కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సహకారంతో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని పాతూరి వెంకటస్వామి గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లన్నగారి మధుసూదన్ రెడ్డి, ఎండి సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

### బోగస్ ఓట్ల ఏరివేత ప్రక్రియను పక్కాగా పూర్తి చేస్తాం



**ఆమనగల్లు, జూలై 28(నినాదం ):** ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్ 2026 ప్రక్రియపై సమన్వయ సమావేశ నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఓటర్ల నమోదు పరిశీలన ప్రక్రియ ఇప్పటివరకు 88.07% పూర్తయిందని తెలిపారు. మొత్తం 16,967 మంది ఓటర్లలో ఇంకా దాదాపు 2,000 మంది ఓటర్లు తమ నమోదు ఫారాలను సమర్పించాల్సి ఉందని వెల్లడించారు. కింది కేటగిరీలకు చెందిన ఓటర్ల సమగ్ర పరిశీలనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు: శాశ్వతంగా వేరే ప్రాంతాలకు తరలివెళ్లిన ఓటర్లుమరణించిన ఓటర్లు, చిరునామాలో లేని ఆచూకీ లభించని ఓటర్లు నమోదు ఫారాలు సమర్పించకపోతే సరైన సమాచారం అందించకపోతే దాదాపు 3,000 మంది ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించబడే ప్రమాదం ఉందని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో పూర్తి సహకారం కోసం పోలింగ్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి పెండింగ్‌లో ఉన్న ఓటర్లందరూ ఈ శనివారం లోగా తమ నమోదు ఫారాలను సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు బోగస్, డబుల్ ఓట్లను తక్షణమే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ను కోరారు. దీనిపై ఎఈఆర్ఓ స్పందిస్తూ, అన్ని నిబంధనలను పాటిస్తూ బోగస్ ఓట్ల ఏరివేత ప్రక్రియను పక్కాగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.




## సెప్టెంబర్ 1లోపు పీఆర్సీ ప్రకటించాలి

లేనియెడల భారీ ఉద్యమం తప్పదు



**ఆలేరు, జూలై 28(నినాదం):** తెలంగాణ రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ ఒకటవ తేదీ లోపు పీఆర్సీ పై స్పష్టమైన నిర్ణయం ప్రకటించక పోతే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 వేల మంది ఉపాధ్యాయులతో భారీ ధర్నా నిర్వహించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ హెచ్చరించారు. ఉపాధ్యాయ సంఘం ( పి ఆర్ టి యు టి ఎస్) సభ్యత్వ వారోత్సవాల సందర్భంగా ఆలేరు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడున్నర సంవత్సరాలుగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదురుచూస్తున్న పే రివిజన్ కమిషన్ ( పి. ఆర్. సి) నివేదికను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థకు వెన్నెముకలాంటి ఉపాధ్యాయుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ బలోపేతంతోనే ఉపాధ్యాయుల సమస్యలను సమర్థవంతంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. సభ్యత్వ వారోత్సవాల సందర్భంగా సంఘం బలోపేతం, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, పెండింగ్ సమస్యల పరిష్కారంపై నాయకులు విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో పీ ఆర్టీ యు టీ ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కుంట్ల అమరేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గడసంతల మధుసూదన్, జిల్లా క్రీడల చైర్మన్ బూడిద శ్రీనివాస్, ఆలేరు మండల అధ్యక్షుడు జోసఫ్, మండల ప్రధాన కార్యదర్శి దశ మంతు, మోట కొండూరు మండల అధ్యక్షుడు ఉమా శేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీపతి నరేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సోమయ్య,తిరుపతి రెడ్డి, నర్సిరెడ్డి, రవికుమార్, కాంతారావు, సత్యనారాయణ రెడ్డి, నరసింహులు తదితర నాయకులు, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి

దుబ్బాకలో కరపత్రం విడుదల చేసిన బీడీ కార్మికుల నాయకులు



**దుబ్బాక, జూలై 28(నినాదం):** తెలంగాణ బీడీ ఉ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర 4వ మహాసభలు ఆగస్టు 16, 17 తేదీలలో సిద్ధిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నేపథ్యంలో వాటిని విజయవంతం చేయాలని కోరుతూ దుబ్బాకలో బీడీ కార్మికులు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. భాస్కర్ మాట్లాడుతూ, తెలంగాణలో వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమ బీడీ పరిశ్రమేనని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల మంది కార్మికులు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని, వారిలో అత్యధికులు మహిళలు, నిరుపేదలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవారేనని తెలిపారు. బీడీ పరిశ్రమలోని అన్ని కేటగిరీల కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతోందని, గత ఉద్యమాలను సమీక్షించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు రాష్ట్ర 4వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతారని, వాటి విజయానికి అన్ని వర్గాల సహకారం అందించాలని కోరారు. బీడీ పరిశ్రమలోని అన్ని కేటగిరీల కార్మికులకు వేతనాలు పెంచాలని, కొత్త జీవోను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం క్యాన్సర్ హెచ్చరికల పేరుతో మరోసారి బీడీ పరిశ్రమపై దాడికి దిగిందని, భారీ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మినీ సిగరెట్లను ప్రోత్సహిస్తూ బీడీ పరిశ్రమను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించకుండా ఆరోగ్యాన్ని సాకుగా చూపుతూ బీడీ పరిశ్రమను దెబ్బతీసే చర్యలను సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. బీడీ కార్మికుల భవిష్యత్, ఉపాధి భద్రత, వేతనాలు, సంక్షేమంపై సమగ్ర కార్యాచరణను ఈ రాష్ట్ర మహాసభల్లో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. అందువల్ల బీడీ కార్మికులు, ప్రజాసంఘాలు, ప్రజలు రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ దుబ్బాక పట్టణ కన్వీనర్ కొంపల్లి భాస్కర్, బీడీ ప్యాకింగ్ కార్మికులు బత్తుల రాజు, తడ్కా సుధాకర్, మహేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ ఉద్యమకారిణి చంధిరెడ్డి శంకరవ్వకు ఘన సత్కారం



**దుబ్బాక, జూలై 28(నినాదం):** తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలో విశేష సేవలు అందించి, మహిళా సాధికారత, సామాజిక న్యాయం, ప్రజా సేవా రంగాల్లో అంకితభావంతో పనిచేసిన తెలంగాణ ఉద్యమకారిణి చంధిరెడ్డి శంకరవ్వ ప్రతిష్ఠాత్మక "ప్రొఫెసర్ జయశంకర్ జాతీయ అవార్డు--2026"ను అందుకున్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన 19వ పశ్చిమ భారతదేశ సదస్సు సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ సంయుక్తంగా ఆమెకు ఈ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. తెలంగాణ ఉద్యమంలో రిలే నిరాహార దీక్షలు, ఆందోళనలు, నిరసన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో విస్తృతంగా చాటడంలో శంకరవ్వ కీలక పాత్ర పోషించారు. మహిళలను ఉద్యమంలో భాగస్వాములను చేయడంతో పాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందించడం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, సమాజ శ్రేయస్సు కోసం నిస్వార్థంగా సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించి గౌరవించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి పురస్కారాలు సేవా స్ఫూర్తిని మరింత పెంపొందించి, సమాజానికి మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వ్యక్తులను గుర్తించి జాతీయ స్థాయిలో సత్కరించడం బహుజన సాహిత్య అకాడమీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నల్లా రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన సామాజిక సేవకులు, సాహితీవేత్తలు, వైద్యులు, ఉద్యమకారులు, విద్యావేత్తలకు వివిధ జాతీయ పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్, బీఎస్ఏ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు గుర్రాల శ్రీనివాస్, కుంబాల రవి, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, సాహితీవేత్తలు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు.

### ఘనంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం



**ఆమనగల్లు, జూలై 28(నినాదం):** తలకొండపల్లి మండలం లింగారావుపల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్లు సహకారంతో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. లయన్ అంజి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ కిరణ్ కుమార్ రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి గంగుల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ శిబిరంలో 25 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. 150 సార్లు రక్తదానం చేసిన లయన్ అంజి రెడ్డిని అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. ఆరోగ్యవంతులంతా రక్తదానం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## భారత వాయుసేనలో చేరండి

గీతం విద్యార్థులకు పిలుపునిచ్చిన ఐఏఎఫ్ అధికారి దీపక్ భరద్వాజ్








**పటాన్చెరు, జూలై 28(నినాదం):** భారత వైమానిక దళం (ఐఏఎఫ్)లో అధికారులుగా లేదా అగ్నివీరులుగా చేరి దేశ సేవ చేయాలని గీతం విద్యార్థులను భారత వాయుసేనకు చెందిన మాస్టర్ వారెంట్ ఆఫీసర్ దీపక్ భరద్వాజ్ ప్రోత్సహించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో 'భారత వైమానిక దళ నియామకం: అభివృద్ధి వాహనం -- వృత్తి మార్గదర్శనం' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఐఏఎఫ్ సహకారంతో, గీతం ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాయుధ దళాలలో వృత్తి అవకాశాల గురించి విద్యార్థులలో అవగాహన కల్పించారు. పలువురు వాయుసేన అధికారుల బృందంతో వచ్చిన దీపక్ భరద్వాజ్, విద్యార్థుల ప్రయోజనం కోసం భారత వైమానిక దళ సామర్థ్యాలను ప్రదర్శించే ఒక మొబైల్ ఎగ్జిబిషన్, సిములేషన్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశారు. సమావేశాన్ని ఉద్దేశించి దీపక్ భరద్వాజ్ మాట్లాడుతూ, యూపీఎస్సీ, ఏఎఫ్ క్యాట్, ఎన్.సీ.సీ. స్పెషల్ ఎంట్రీ ద్వారా పర్మనెంట్ కమిషన్ లేదా షార్ట్ సర్వీస్ కమిషన్ తో ఐఏఎఫ్ లో చేరవచ్చన్నారు. ఒకసారి ప్రవేశ స్థాయి అధికారిగా చేరాక, వైమానిక దళాధిపతి (చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్) పదవి వరకు ఎదగొచ్చని చెప్పారు. అలాగే ఫ్లయింగ్, టెక్నికల్, గ్రౌండ్ డ్యూటీ విభాగాలతో పాటు, ప్రతి విభాగానికి కావలసిన అర్హతా ప్రమాణాలు, అవసరమైన అర్హతల గురించి కూడా ఆయన విపులంగా తెలియజేశారు. అంతే కాకుండా, ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డు (ఐఎఫ్ఎస్బీ) ప్రక్రియను కూడా ఆయన వివరించారు. ఇందులో రాత పరీక్షలు, వ్యక్తిత్వ మదింపు, మానసిక పరీక్షలు, గ్రూపు టాస్క్‌లు, ఇంటర్వ్యూలు, వైద్య పరీక్షలు, ప్రతిభ ఆధారిత ఎంపిక వంటి అంశాలు కూడా ఉంటాయన్నారు. శాస్త్రీయ, పారదర్శకమైన ఎంపిక విధానాన్ని ప్రస్ఫుటీకరిస్తూ, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, నిబద్ధతతో సిద్ధం కావాలని ఆయన ప్రోత్సహించారు. వైమానిక దళ వృత్తి వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, దీపక్ భరద్వాజ్ ఆకర్షణీయమైన జీతభత్యాలు, సదుపాయాలతో కూడిన వసతి, సమగ్ర వైద్య సంరక్షణ, విద్యావకాశాలు, సెలవు ప్రయోజనాలు, బీమా సౌకర్యం, సాహస కార్యకలాపాలు, వృత్తిపరమైన అభివృద్ధి గురించి మాట్లాడారు. భారత వైమానిక దళం పరిణామం, జాతీయ భద్రత, సైనిక లాజిస్టిక్స్, మానవతా సహాయం, విపత్తు సహాయం, క్షతగాత్రుల తరలింపులో దాని కీలక పాత్రలతో పాటు 1965, 1971 ఇండో-పాక్ యుద్ధాల సమయంలో దాని సహకారం గురించి కూడా ఒక అవలోకనాన్ని అందించారు. ఐఏఎఫ్ ఆధునిక యుద్ధ విమానాలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లు, గగనతల నిఘా వ్యవస్థలను ఆయన విద్యార్థులకు పరిచయం చేశారు. తొలుత, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణు కుమార్ నాతి అతిథులకు స్వాగతించి, సత్కరించగా, కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ మహమ్మద్ అక్తర్ ఖాన్, ఇంజనీరింగ్ విద్యార్థులకు వృత్తి అవగాహన కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. అధ్యాపక బృందం, విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, ఐఏఎఫ్ అధికారులతో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

### ఆమనగల్లు అక్రమ భూమి కబ్జాపై కౌన్సిలర్ల ఫిర్యాదు



**ఆమనగల్లు, జూలై 28(నినాదం):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి శివారులో గల సర్వే నంబర్ 1027లోని 4.06 గుంటల ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి అక్రమంగా కబ్జా చేసి తోటలు, పంటలు పండిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ అక్రమ కబ్జాపై స్పందించిన ఆమనగల్లు మున్సిపాలిటీ కౌన్సిలర్లు, తహసీల్దార్ ఫహీమ్ ఖాద్రిని నేరుగా కలిసి వినతిపత్రం సమర్పించారు. కబ్జాలో ఉన్న ఆ భూమిని తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, మున్సిపల్ అభివృద్ధి పనులకు లేదా గ్రామ ప్రజల అవసరాలకు కేటాయించాలని వారు కోరారు. తహసీల్దార్ ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం... ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఏనుముల రమేష్, మొక్తల వెంకటయ్య, నాగిళ్ళ జగన్, ఎర్రవోలు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బుధవారం, తెలంగాణ
29 జూలై 2026

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం — నిఖార్సైన జర్నలిజం

## నిఘా వ్యవస్థ పటిష్టపర్చాలి

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 285 (నినాదం) :** వేరే ప్రాంతాలనుండి వచ్చి వెళ్లే వారిపై నిఘా వ్యవస్థ పటిష్ట పరిచి చుట్టూ ప్రక్కల వారితో పోలీసు సిబ్బంది సత్సంబంధాలు మెరుగుపరుచుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. మంగళవారం నగరంలోని 3వ పోలీస్ స్టేషన్ ను సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఫైల్స్ ను క్షుణ్ణంగా తనిఖీ లు నిర్వహించారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు అందజేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రికార్డ్ లను పరిశీలిస్తూ అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ చేయాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలు సూచనలు చేశారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్లైన్ బెట్టింగ్స్, ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ, సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి, చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని అన్నారు. గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణ కోసము యువతను ఎల్లప్పుడూ చైతన్యవంతులను చేయాలని, అన్ని ప్రాంతాలలో డ్రగ్స్ వాడకం నిషేధం అని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది 24 గంటలపాటు తమ హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని, సిబ్బంది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ హెల్త్ చెకప్ చేయించుకోవాలని,ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. సీపీ వెంట నిజామాబాద్ ఏసిపి ప్రకాష్ యాదవ్, టౌన్ సిఐ శ్రీనివాస్ రాజ్, ఎస్సై హరిబాబు, 2వ ఎస్ఐ నారాయణ, సిబ్బంది ఉన్నారు.

## అన్నదాతలను, సైనికులను సన్మానించుకోవడం గొప్ప విషయం

స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 28 (నినాదం) :** దేశానికి వెన్నుముక్క రైతు అయితే దేశ ప్రజలను దేశ సమైక్యతను సౌభ్రతత్వాన్ని చాటి చెప్పేది దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టేది సైనికుడని అలాంటి అన్నదాతలను సైనికులను సన్మానించుకోవడం ఎంతో శుభ పరిణామమని స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాల, టిఎంఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సైనికులకు వందనం రైతులకు నీరాజనం కార్యక్రమాన్ని అలాగే కేంద్ర ప్రభుత్వం ఆదేశాల అనుసారం స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా దేశభక్తిపై చైతన్య కార్యక్రమాలను పురస్కరించుకొని పలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మానసిక వికలాంగులకు యోగా, డ్రాయింగ్, పెయింటింగ్, పాటల పోటీలను నిర్వహించారు. టిఎంఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాటి వీరేశం వారి మనవడు తాటి స్తోత్ర కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. స్నేహ సొసైటీ దివ్యాంగుల పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అనంతరం సైనికులకు అలాగే రైతులను ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విచ్చేసిన అతిథులు మాట్లాడుతూ సైనికులకు వందనం రైతులకు నీరాజనం కార్యక్రమం ద్వారా సైనికులను రైతులను ఘనంగా సన్మానించడం ఎంతో సంతోషకరమన్నారు. అలాగే స్నేహ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఇన్ని సంవత్సరాలుగా ఎన్నో ఒడిదుడులు ఎదుర్కొని దివ్యాంగ మానసిక విద్యార్థుల ఉన్నతీ కోసం స్నేహ సొసైటీ నిర్వాహకులు ఎస్ సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, సిబ్బంది సేవా ఎంతో అభినందనీయమన్నారు.. ఇప్పటివరకు ఎంతోమందిని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో నిలిపే స్థాయికి తీసుకురావడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు.. ఇంకా చాలామంది దివ్యాంగ విద్యార్థుల్లో వెలుగులు నింపేందుకు నిరంతరంగా కృషి చేస్తుండడం వారి పట్టదల ఆశయ సాధనకు చెప్పుకోదగ్గ విషయం అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా చేపట్టిన మానసిక దివ్యాంగ విద్యార్థులైనప్పటికీ కూడాను సైనికులకు వందనం రైతులకు నీరాజనం కార్యక్రమంతో పాటు స్నేహ సొసైటీ విద్యార్థులు ప్రదర్శించిన నాటక ప్రదర్శన,పాడిన పాటలు నృత్యాలు ఎంతో అద్భుతంగా ప్రదర్శించారని వారు తెలిపారు. తమ వంతు బాధ్యతగా స్నేహ సొసైటీ దివ్యంగా విద్యార్థుల కోసం తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి, మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, జిల్లా విశ్రాంత సైనికుల సంఘం అధ్యక్షుడు సుర హర ప్రసాద్, శ్రీ నూతన వైశ్య పాఠశాల అధ్యక్షుడు ఇంగు శివప్రసాద్, కార్యదర్శి కొండ సత్య ప్రసాద్, మాజీ సైనికులు బాదావత్ రాజేందర్, రేకాజి రాజేశ్వర్, రైతులు అబ్బగోని గంగాధర్ గౌడ్, వరికూటి మాల కొండారెడ్డి, ఒంటిపల్లి శ్యామ్ కుమార్ లను స్నేహ సొసైటీ ,టిఎంఆర్ ఫౌండేషన్ ఘనంగా సన్మానించారు.

## సూదిని జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే



**కల్వకుర్తి జులై 28 (నినాదం):** మాజీ కేంద్రమంత్రి దివంగత సూదిని జైపాల్ రెడ్డి 7వ వర్ధంతిని పురస్కరించుకుని కొట్ర చౌరస్తాలో విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారయణ రెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో విలువలకు కట్టుబడి ప్రజా సేవ చేసిన అరుదైన నాయకుడు జైపాల్ రెడ్డి అని కొనియాడారు. పార్లమెంటరీ వ్యవస్థలో ఆయనకున్న ప్రత్యేక గుర్తింపు, ప్రజాస్వామ్య పరిరక్షణకు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్ కుమార్,మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి,హరికిషన్ రెడ్డి,సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

ఢిల్లీలో కేంద్ర మంత్రులు, ఎంపీలను కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



**హైదరాబాద్ , జూలై 28 (నినాదం ) :** కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు పలువురు కేంద్ర మంత్రులను, పార్లమెంటు సభ్యులను కలిసి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలపై సోమవారం జంతర్ మంతర్ లో ధర్నా నిర్వహించిన ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్ తదితరులు మంగళవారం కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, టీఆర్ ఎస్ పార్టీకి చెందిన వద్దిరాజు రవిచంద్ర తదితరులకు వినతిపత్రాలు అందజేశారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు ఉన్న రైల్వే రాయితీ పాస్ లను గత కోవిడ్ సందర్భంగా రద్దు చేశారని, ఈ సదుపాయాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు. దేశవ్యాప్తంగా రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పిస్తూ జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని, జర్నలిస్టుల రక్షణకు పార్లమెంటులో ప్రత్యేక చట్టం చేయాలని వారు కోరారు. జర్నలిస్టులకు, సొసైటీలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించే విషయం పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన ఆయా సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, బుడిగె మల్లేష్ ,పర్కాల సమ్మయ్య గౌడ్, కె. రమాదేవి, పద్మనాభరావు,నాయకులు గోపాల్, మోయిజ్ వివిద జిల్లాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దతుండ్ల ఎస్సీ కాలనీలో రూ.10 లక్షల రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో
అభివృద్ధి పనుల ప్రారంభం
టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు
సహకారంతో రోడ్డు నిర్మాణం
గ్రామ సర్పంచ్ బండారి నర్సింగం చేతుల
మీదుగా పనుల ప్రారంభం

**మల్హర్, జూలై 28 (నినాదం):** మల్హర్ రావు మండలంలోని పెద్దతుండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో రూ. 10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించారు. ఈ పనులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరియు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు చొరవతో మంజూరైనట్లు నాయకులు తెలిపారు.రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ బండారి నర్సింగం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, మల్హర్ రావు ఉప సర్పంచ్ తల్లా రవీందర్, వార్డు సభ్యులు బండ విష్ణువర్ధన్, పింగళి వంశీ, మంత్రి రాజసమ్మయ్య, కందుగుల రాజశేఖర్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఎస్సీ కాలనీలో రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మరిన్ని పనులు కూడా దశలవారీగా చేపడతామని పేర్కొన్నారు. గ్రామస్థులు రోడ్డు పనులు ప్రారంభమైనందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

# నిద్రపోతున్నది పాలకవర్గమా.. లేక అధికారులా?

ఆన్‌సాన్‌పల్లి–గొర్లవీడు ప్రధాన రహదారి దుస్థితిపై బీఆర్ఎస్ నాయకుడు బానోత్ రాజ్‌కుమార్ (ఢిల్లీ రాజు) ఆగ్రహం



**మల్హర్ , జూలై 28 (నినాదం):** ఆన్‌సాన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని లంబాడి తండా నుంచి గొర్లవీడు వెళ్లే ప్రధాన రహదారి స్వల్ప వర్షానికే పూర్తిగా దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకుడు బానోత్ రాజ్‌కుమార్ (ఢిల్లీ రాజు) ఆరోపించారు. మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఈ సమస్యను ఇప్పటికే పలుమార్లు గ్రామసభలో పాలకవర్గం, గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. గ్రామసభలో సమస్యలను నమోదు చేయడం మినహా రహదారి మరమ్మతులపై కార్యాచరణ కనిపించడం లేదని విమర్శించారు. పత్రికల ద్వారా ప్రభుత్వ అధికారులకు కూడా పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుతం రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు కాలినడకన కూడా ప్రయాణించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన" పేరుతో గొప్పలు చెప్పుకునే పాలకవర్గం ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించాలని, ఆన్‌సాన్‌పల్లి––గొర్లవీడు ప్రధాన రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని బానోత్ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పాలకవర్గం, సంబంధిత అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన హెచ్చరించారు.

# ఉద్యమకారులను వెంటనే గుర్తించి, ఆదుకోవాలి

జిల్లా ప్రధాన కార్యదర్శి ముడితనపల్లి ప్రభాకర్ డిమాండ్



**మల్హర్, జూలై 28 (నినాదం):** మల్హర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలో సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు బూడిద సతీష్ అధ్యక్షతన ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టియూఎఫ్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ముడితనపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపు కమిటీ పేరుతో కాలయాపన చేయడం సరైనది కాదని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం వచ్చి సమయం గడుస్తున్నా ఇంకా కమిటీలతోనే కాలం వెళ్లదీయడం ఏంటని ప్రశ్నించిన ఆయన, దశాబ్దంన్నర పాటు తమ వృత్తులు, వ్యాపారాలు, కుటుంబాలను పక్కన పెట్టి తెలంగాణ కోసం అంకితమైన ఉద్యమకారులు నేడు దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే బలమైన ఉద్యమంగా సాగిన తెలంగాణలో, ఇతర రాష్ట్రాలైన ఉత్తరాఖండ్, జార్ఖండ్ తరహాలోనే ఉద్యమకారులను గుర్తించి ఆదుకోవాలని, వారికి తక్షణమే సంక్షేమ పథకాలు, పెన్షన్లు, హెల్త్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం వచ్చి 10 ఏళ్లు దాటినా కనీస గుర్తింపు లేకపోవడం దౌర్భాగ్యమని, ఇకనైనా కేకే కమిటీ సూచనలు, సలహాల పేరుతో కాలయాపన చేయకుండా త్వరితగతిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియ ప్రారంభించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫోరం నాయకులు షేక్ చాంద్ పాష, చొప్పరి రాజు, కోట నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నీనో ప్రభావం దృష్ట్యా వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి: కలెక్టర్ కె. హైమావతి



**నంగునూరు జులై 28 (నినాదం):** ఎల్‌నీనో ప్రభావం కారణంగా ఆగస్టు చివరి వారం నుంచి సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉందని, భూగర్భ జలాలు మరింత అడుగంటిపోయే పరిస్థితి ఏర్పడుతుందని, రైతులు వరి సాగును తగ్గించి నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి రైతాంగానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంట మార్పిడి, ఎల్‌నీనో ప్రభావం, వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, భూగర్భ జలాల స్థితి, ఆయిల్ పామ్ సాగుపై రాష్ట్రవ్యాప్తంగా రైతులు, అధికారులకు దిశానిర్దేశం చేయగా, నంగునూరు మండలం నర్మేట రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ జూన్, జూలై నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని, ప్రస్తుతం చిరుజల్లులు పడుతున్నప్పటికీ ఆగస్టు చివరి వారం నుంచి సెప్టెంబర్‌లో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశముందని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారని తెలిపారు. జిల్లాలో రైతులు సంప్రదాయంగా వరి సాగుపైనే ఆధారపడుతున్నారని, ఒక ఎకరం వరికి అవసరమైన నీటితో ఐదు ఎకరాల ఆరుతడి పంటలు సాగు చేయవచ్చని, ప్రస్తుతం భూగర్భ జలాలు రోజురోజుకు తగ్గిపోతుండటంతో వరి ఏపుగా పెరిగే సమయంలో నీటి కొరత తీవ్రంగా ఏర్పడి పంట ఎండిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల రైతులు కందులు, పప్పుదినుసులు, రాగులు, సజ్జలు, కొర్రలు, ఇతర మిల్లెట్ పంటలు, ఆముదం వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని, నర్మేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఉన్నందున ఆయిల్ పామ్ సాగును విస్తరించి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని, అందులో అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చని సూచించారు. అలాగే అడపాదడపా కురుస్తున్న వర్షపు నీటిని వృథా కాకుండా వీబీ–జీరామ్ పథకం కింద ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, సామూహిక ఇంకుడు గుంతలు, రూఫ్ వాటర్ రీఛార్జ్ నిర్మాణాలు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి ప్రతి నీటి చుక్కను భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని, ఈ కార్యక్రమాల్లో ప్రతి గ్రామంలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మల్లయ్య, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవులపల్లి యాదగిరి, స్థానిక సర్పంచ్ శనిగరం స్వాతి బాబు, పీఏసీఎస్ ఛైర్మన్ కోలా రమేష్, మైపాల్ రెడ్డి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## వెనుకతండాకు చెందిన చింటూ కనబడుటలేదు



**వెల్దుర్తి చేగుంట, జులై 28 (నినాదం):** ఉమ్మడి చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో న మాసాయిపేట మండలం వెనుక తండాకు చెందిన వ్యక్తి కనబడడం లేదు అని పోలీసులు తెలిపారు ఈ సందర్భంగా వివరాల్లోకెళ్తే ఫోటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు మాలోత్ చింటూ తండ్రి కిమ్యా వయసు 19 సంవత్సరాలు, కులం లంబాడా, గ్రామం వెనుక తాండ నడమితాండ గ్రామపంచాయతీ మాసాయిపేట మండలం పుట్టు మూగ, చెవిటి మరియు మానసిక వైఖల్యం కలదు. తేదీ 27. 07. 2026 నాడు సాయంత్రం అందజ 5.00 గంటలకు వెనుక తండా లో ఐడియాల్ స్కూల్ బస్సులో ఎక్కి పెద్ద శివనూర్ బస్ స్టాప్ దిగి నాడు, అక్కడి నుంచి కనిపించట్లేదు. ఈ రోజు తేదీ 28.07.2026 నా అతని తండ్రి మాలోత్ కిమ్యా తండ్రి సంగ్య మంగళవారం నాడు ఫిర్యాదు చేయగా, చేగుంట యస్ ఐ, పి బిక్య నాయక్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనది. ఇట్టి వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే చేగుంట పోలీస్ స్టేషన్ పి భీక్య నాయక్ 8712581724,కి తెలుపగలరు.

## మాజీ మంత్రిని పరామర్శించిన ఎమ్మెల్యే



**కల్వకుర్తి జులై 28 (నినాదం):** గత కొన్ని రోజుల క్రితం స్వస్థతకు గురై అనారోగ్యంతో బాధపడుతున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్ దాస్ నీ కల్వకుర్తి పట్టణంలో నీ ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పరామర్శించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు పి సి సి సభ్యులు శ్రీనివాస్ గౌడ్,కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్,మట్ట వెంకటయ్య గౌడ్,మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి,మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్,పాల్గొన్నారు.

## ముఖ్యఅతిథిగా నాగారం మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి



**కీసర, జూలై 28, (నినాదం):** దేశంలోనే అగ్రగామి మారుతి సుజుకి డీలర్ సంస్థ వరుణ్ మోటార్స్ ప్రేవేట్ లిమిటెడ్ అత్యాధునిక సాంకేతిక, శక్తివంతమైన పనితీరు, అదునాతన భద్రత ప్రమాణాలతో రూపొందించిన నూతన బ్రెజ్జా టర్బో బూస్టర్జెట్ వాహనాన్ని రాంపల్లి షోరూంలోలి ఘనంగా ఆవిష్కరించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వాహనాన్ని ఆవిష్కరించారు. సరికొత్త 2026 మారుతి సుజుకి బ్రెజ్జా భారత మార్కెట్లో అధికారికంగా విడుదలైంది. దీని ప్రారంభ ఎక్స్ షోరూమ్ ధర ?7.40 లక్షలు. కొత్త మోడల్‌లో డిజైన్, ఫీచర్లు, భద్రత, ఇంజిన్ ఎంపికల్లో పలు అప్‌డేట్లు ఉన్నాయని తెలిపారు.

## గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలి

ఎంపీడీవో శేషగిరి శర్మ



**మిర్యాలగూడ జులై 28( నినాదం):** మిర్యాలగూడలో మండలంలోని 46 గ్రామపంచాయతీల్లో జూలై 29న గ్రామసభలు నిర్వహించి సమగ్ర గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ ఎం. శేషగిరిశర్మ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తెలంగాణ జలసిరి, వివిజిరాంజీ పథకాల కింద నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిపాదనలను త్వరగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జూలకంటి వెంకట్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మూలగుంట్ల వీరమ్మ పార్థివదేహానికి నివాళులర్పించిన బి ఆర్ఎస్ నాయకులు



**ఖమ్మం, జులై 28(నినాదం ):** ఏన్కూర్ మండలం రాయమాదారం గ్రామానికి చెందిన మూలగుంట్ల వీరమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బి ఆర్ ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకులు ఆజ్మీరా వీరు నాయక్ రాయమాదారం సందర్శించి, వీరమ్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మండల నాయకులు, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్,కొనకాంచి కొండా గ్రామ నాయకులు బాబులాల్ మరియు ఇతర స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుధవారం, తెలంగాణ
29 జులై 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## లింగోజిగూడ డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తా: కందికంటి శ్రీధర్ గౌడ్



**ఎల్బీనగర్, జూలై 28,(నినాదం):** డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందిస్తానని లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందికంటి శ్రీధర్ గౌడ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని కామేశ్వరరావు నగర్ కాలనీ మైనార్టీ నాయకులు శ్రీధర్ గౌడ్ ను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ, డివిజన్‌కు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సేవ చేసే అవకాశం కల్పించిన నియోజకవర్గ ఇంచార్జ్ మధుయాష్కిగౌడ్ లతో పాటు పార్టీ పెద్దలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## ఆరుతడి పంటల సాగుతోనే రైతులకు లాభాలు: ఏడీఏ జగదీశ్వర్‌రెడ్డి



**నినాదం, వేములపల్లి, జులై 28(నినాదం):** ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా రైతులు మంచి లాభాలను ఆర్జించవచ్చని ఏడీఏ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం రైతు వేదికలో నిర్వహించిన 'రైతు నేస్తం, విత్తనమేళా' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ వానాకాలం సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఈ నేపథ్యంలో ఆయకట్టు రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలైన పెసర, మినుము, కంది, నువ్వులు వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే ఈ పంటల ద్వారా ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. చెరువులు, బావులు, బోర్ల కింద అందుబాటులో ఉన్న నీటి లభ్యత ఆధారంగానే మోతాదులో వరి సాగు చేపట్టి, మిగిలిన భూముల్లో మెట్ట పైర్లను సాగు చేసుకోవడం వల్ల మేలు జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా, వరి సాగు చేసిన పొలాల్లో కూడా గట్ల వెంట కంది సాగు చేస్తే అదనపు ఆదాయం లభించి వ్యవసాయం లాభదాయకంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కిశోర్‌నాయక్, ఏఈఓలు రమేష్, షఫి, స్థానిక రైతులు మాధవరెడ్డి, పుల్లయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



**రాజేంద్రనగర్, జులై 28 (నినాదం):** రాజేంద్రనగర్ తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎ.ఇ.ఆర్.ఓ, తహశీల్దార్ బొమ్మ రాములు కీలక సమావేశం నిర్వహించారు. లక్ష్మీగూడ, మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, గగన్‌పహాడ్, శాస్త్రిపురం, బుద్వేల్ ప్రాంతాలకు సంబంధించిన వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడూతూ... సంబంధిత ప్రాంతాల పరిధిలోని 86 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,07,441 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. వీరిలో ఇప్పటివరకు 53,264 మంది ఓటర్ల డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయిందని, ఇంకా 47,714 మంది డిజిటైజేషన్ కావలసి ఉందని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను సమావేశంలో పాల్గొన్న అన్ని రాజకీయ పార్టీల నాయకులకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లందరూ వెంటనే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను నింపి, సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్లకు అందజేసేలా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. సమావేశంలో పోలింగ్ కేంద్రాల వర్గీకరణ/పునర్వ్యవస్థీకరణ అంశంపై కూడా చర్చించారు. ఎన్యుమరేషన్ ఫారమ్స్ ఇంకా సమర్పించని ఓటర్లు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బొమ్మ రాములు విజ్ఞప్తి చేశారు.

## మంత్రికి వినతి పత్రం అందజేత



**కాటారం, జూలై 28 (నినాదం):** కాటారం మండల కేంద్రం గారేపల్లి గ్రామ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి కొట్టే శ్రీహరి, మాజీ ఎంపీటీసీ జాడి మహేశ్వరి, కాంగ్రెస్ నాయకుడు గోనే మహేష్ మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ. 2.60 కోట్లు, మున్నూరు కాపు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 1 కోటి మంజూరు చేయాలని వారు మంత్రిని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి శ్రీధర్‌బాబు ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందిస్తూ, నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. గ్రామాభివృద్ధి పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రికి కొట్టే శ్రీహరి, జాడి మహేశ్వరి, గోనే మహేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వర్షాభావ పరిస్థితులపై ప్రజలకు అవగాహన.. నేడు ప్రత్యేక గ్రామసభ



**భిక్కనూర్, జూలై 28 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జలసిరి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 11 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించనున్నారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి బాల్యాల రేఖ సుదర్శన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వర్షాభావ పరిస్థితులు, వాటి ప్రభావం, నీటి సంరక్షణ, నీటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించను న్నారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు, రైతులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామపంచాయతీ అధికారులు కోరారు.

# రోడ్లపై గుంతల రాజ్యం... ప్రజల ప్రయాణానికి పరీక్ష

### వర్షాలతో మరింత అధ్వాన్నంగా మారిన రహదారులు
### ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న గుంతలు









**రేవల్లి జులై 28 (నినాదం) :** "అభివృద్ధికి రహదారులే ప్రాణాధారం" అని చెప్పుకుంటున్నా, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం అందుకు భిన్నమైనపరిస్థితులు కనిపిస్తున్నాయి. వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని పలు గ్రామాలను కలిపే రహదారులు గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పరిస్థితి మరింత దిగజారింది. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో అసలు రహదారి ఎక్కడ, గుంత ఎక్కడ అనే పరిస్థితి నెలకొంది. రేవల్లి-తల్పునూరు, రేవల్లి-నాగాపూర్, రేవల్లి-కొంకలపల్లి, రేవల్లి-కేశంపేట తదితర మార్గాల్లో అనేక చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. ప్రతిరోజూ ఈ మార్గాల్లో ప్రయాణించే ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించే ప్రయత్నంలో ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నా యి. వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించే రైతులు సమయానికి గమ్యస్థానానికి చేరుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటల రవాణా ఖర్చులు కూడా పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లే రోగులకు కూడా ఈ రహదారులు సమస్యగా మారాయి. అంబులెన్స్‌లు వేగంగా వెళ్లలేక విలువైన సమయం వృథా అవుతోందని స్థానికులు చెబుతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా నిత్యం ఈ రోడ్లపైనే ప్రయాణించాల్సి వస్తోంది. వర్షం పడిన రోజుల్లో గుంతల్లో నీరు నిలవడంతో వాహనాలు జారిపడే ప్రమాదం అధికమవుతోంది. రాత్రివేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా నాణ్యమైన రహదారులను నిర్మించాలని, దెబ్బతిన్న ప్రాంతాలను వెంటనే మరమ్మతు చేయాలని కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారుల సమస్యను ప్రాధాన్యంగా తీసుకుంటేనే గ్రామీణ ప్రాంతాల్లో సురక్షిత ప్రయాణానికి మార్గం సుగమమవుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

### డ్రై డే కార్యక్రమంలో
### దుబ్బాక పురపాలక కమిషనర్ ఎ. మహేష్ కుమార్



**దుబ్బాక, జూలై 28(నినాదం):** విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండగలరని దుబ్బాక పురపాలక కమిషనర్ ఎ. మహేష్ కుమార్ అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని 14వ వార్డులో ఉన్న మైనారిటీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, సమీకృత బాలుర వసతి గృహంలో వార్డు కౌన్సిలర్ తునికి సురేష్తో కలిసి డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వంటశాల, భోజనశాల, శౌచాలయాలను పరిశీలించిన కమిషనర్, పరిసరాల్లో పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలను సిబ్బందితో తొలగింపజేసి బ్లీచింగ్ పౌడర్, ఇతర క్రిమిసంహారక రసాయనాలను చల్లించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పరిసరాల పరిశుభ్రతపై డ్రై డే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వసతి గృహాలు, విద్యాసంస్థల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు విద్యార్థులు, సిబ్బంది సమష్టిగా కృషిచేయాలని సూచించారు. నీటి తొట్టెలు, డ్రమ్ములు, ఇతర పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు, అపరిశుభ్రత కారణంగా ఈగల ద్వారా అతిసార వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# గ్రామాల అభివృద్ధిపై అధికారులు ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలి

### ప్రత్యేక అధికారి సురేంద్ర కుమార్





**అమరచింత, జూలై 28, (నినాదం):** గ్రామాలలో చేపట్టవలసిన అభివృద్ధి పనుల పై అధికారులు ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి నరేంద్ర కుమార్ అన్నారు. ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి మండల ప్రత్యేక అధికారి నరేంద్ర కుమార్ హాజరయ్యారు. ఎంపీడీవోశ్రీ రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు గ్రామ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మొదట వివిధ శాఖల అధికారులు తమ శాఖల పనితీరుపై నివేదికలు సమర్పించారు. విద్యాశాఖ ఇరిగేషన్ శాఖ ఆర్డబ్ల్యూఎస్ మహిళా సమాఖ్య ఈజీఎస్ ఐసిడిఎస్ పంచాయతీరాజ్ శాఖ వ్యవసాయ శాఖ అధికారులు నివేదికలు సమర్పిస్తుండగా సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులకు విన్నవించారు. గ్రామాలలో తాగునీటి వ్యవస్థను కుండా చూడాలని అంతర్గత రహదారులను మరమ్మతులు చేపట్టాలని వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేసి దోమల నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళిక చేపట్టనున్నట్లు సంబంధిత అధికారులు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఎంపీ ఓ రాజు, ఏ పీ ఓసువర్ణ, ఏపీఎం పారిజాత పంచాయతీరాజ్ ఏఈ నరేష్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సూదిని జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

### 7వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతల ఘన నివాళి



**ఆమనగల్లు, జూలై 28(నినాదం):** మాజీ కేంద్రమంత్రి దివంగత సూదిని జైపాల్ రెడ్డి 7వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లిపట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, స్థానిక నేతలతో కలిసి ఈసందర్భంగా జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో విలువలకు కట్టుబడి ప్రజాసేవ చేసిన అరుదైన నాయకుడు జైపాల్ రెడ్డి అని కొనియాడారు. పార్లమెంటరీ వ్యవస్థలో ఆయనకున్న ప్రత్యేక గుర్తింపు, ప్రజాస్వామ్య పరిరక్షణకు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వస్పుల మానయ్య, సీనియర్ నాయకులు ధనుంజయ, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, నాయకులు అప్పం శ్రీను, కొండల్ రెడ్డి, నిట్ట నారాయణ, వెంకట్ రెడ్డి, విజయ్ నాయక్, కాలే మల్లయ్య, గోల్డ్ రామ్, సేవాదళ్ దశరథం, గాజుల శ్రీను, పర్వతాలు, పూసల వెంకటయ్య, అండేకర్ రాజు, గాజుల సురేష్, అబ్దుల్ అలీమ్, కండె సాయి, అబ్దుల్ కరీం, కొప్పు రాఘవేందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, శ్రీధర్ నాయక్, శ్రీను నాయక్, కొప్పు శ్రీశైలం, జగన్, సుక్క వెంకటయ్య, ఉపసర్పంచ్ నాయక్, శ్రీను, కుమార్ గౌడ్, పర్వతాలు, నాజర్, గౌస్, రఫీ, శంకర్ నాయక్, అబ్దుల్ రహీం, రాంబాబు, నరేందర్, కోట రామక్రిష్ణ, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి, జులై 28( నినాదం):** మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్‌నగర్ డివిజన్‌లోని ఐ ఎన్ నగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు అనిత, లక్ష్మణ్, కృష్ణ, శ్రీనివాస్, సుభాష్, సాయికుమార్, నాయకులు అనిల్, వెంకటేష్, మల్లేశ్, నర్సింగ్ రావు, గణేష్, సుధాకర్, కిషన్, సతీష్, నరహరి, స్థానిక బస్తీ వాసులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 100వ మెగా 'రైతునేస్తం' కార్యక్రమం



**కాటారం, జూలై 28( నినాదం):** రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'రైతునేస్తం' కార్యక్రమం 100వ ఎపిసోడ్‌కు చేరుకున్న సందర్భంగా మంగళవారం మండలంలోని రైతు వేదికలో మెగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఆధునిక సాగు పద్ధతులు, పంటల నిర్వహణలో పాటించాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పూర్ణిమ, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) పాల్గొని రైతులతో ప్రత్యక్షంగా చర్చించారు. వ్యవసాయంలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సూచనలు అందించారు. మెరుగైన దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, పంటల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాటారం మండలానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నారులకు ఉచిత దుస్తుల పంపిణీ

### సర్పంచ్ శైలజ దంపతులు



**గద్వాల ప్రతినిధి జులై 28 (నినాదం):** జోగులాంబ గద్వాల జిల్లా బిజ్వారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఉచిత దుస్తుల పంపిణీ కార్యక్రమం ఆదర్శవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీమతి శైలజ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో కీలక మని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రతి అర్హులైన చిన్నారికి చేరవేయడంలో అంగన్‌వాడీ సిబ్బంది విశేష కృషి చేస్తున్నారని అభినందించారు. గ్రామంలోని ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగాలనే లక్ష్యంతో ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. చిన్నారుల విద్య, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ విషయం లో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహి ళ లు, తల్లిదండ్రులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం చిన్నారులతో కలిసి సర్పంచ్ దం పతులు ఆప్యాయంగా ముచ్చటించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ముత్తారంలో భూముల రీ-సర్వేపై అవగాహన సదస్సు



**భీమదేవరపల్లి జూలై 28 (నినాదం):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో భూముల రీ-సర్వేపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ రాజేష్ మాట్లాడుతూ, రీ-సర్వేతో భూములకు స్పష్టమైన హద్దులు ఏర్పడి, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఆధునిక డీజీపీఎస్ సాంకేతికతతో సర్వే చేపట్టి ప్రతి భూమికి ప్రత్యేక మ్యాప్, భూధార్ సంఖ్య కేటాయించనున్నట్లు చెప్పారు. మండలంలోని ముత్తారం, భీమదేవరపల్లి, రత్నగిరి, మాణిక్యాపూర్, కొప్పూర్, ముస్తఫాపూర్ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# నల్ల నేలపై హరిత హారం

**పచ్చదనంతో పరవళ్ళు తొక్కుతున్న గనుల ప్రాంతం**

**2 లక్షల మొక్కలతో సింగరేణి హరిత సంకల్పం**



**మంచిర్యాల, జులై 28(నినాదం):** ఒకవైపు దేశానికి వెలుగు పంచే బొగ్గును వెలికితీస్తూనే... మరోవైపు భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతిని అందించాలనే సంకల్పంతో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్-సీసీఎల్) హరిత విప్లవానికి శ్రీకారం చుట్టింది. బొగ్గు గనులుగా పేరొందిన ప్రాంతాలను పచ్చని వనాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ ఏడాది ఏకంగా రెండు లక్షలకు పైగా మొక్కలను నర్సరీల్లో పెంచి సిద్ధం చేసింది. వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ గని ప్రాంతాలు, కార్మిక కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రధాన రహదారులు, పారిశ్రామిక ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో దశలవారీగా వీటిని నాటేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించింది. ఒకప్పుడు బొగ్గు ధూళి, పొగ, యంత్రాల శబ్దాలతో కనిపించిన అనేక గని ప్రాంతాలు నేడు పచ్చని చెట్లతో కళకళలాడుతున్నాయి. గత కొన్నేళ్లుగా చేపట్టిన హరిత కార్యక్రమాల ఫలితంగా ప్రకృతికి కొత్త జీవం లభించింది. అదే స్ఫూర్తితో ఈసారి మరింత విస్తృత స్థాయిలో మొక్కల పెంపకం, పంపిణీ, సంరక్షణ కార్యక్రమాలను చేపట్టి పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలవాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

**మొక్క నాటడమే కాదు... బతికించడమే అసలు లక్ష్యం...**



చాలా సంస్థలు మొక్కలు నాటి కార్యక్రమాన్ని ముగిస్తే... సింగరేణి మాత్రం ప్రతి మొక్కను చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించే విధానాన్ని అమలు చేస్తోంది. ప్రతి మొక్కకు రక్షణ కంచె ఏర్పాటు, నిరంతర నీటి సరఫరా, ఎరువుల వినియోగం, కలుపు తొలగింపు, అధికారుల పర్యవేక్షణ వంటి చర్యలతో మనుగడ శాతాన్ని పెంచుతోంది. మొక్క నాటడం ఒక రోజు పని... దాన్ని బతికించడం సంవత్సరాల బాధ్యత అనే భావనతో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సింగరేణి నర్సరీల్లో స్థానిక వాతావరణానికి అనువైన చెట్లతో పాటు పుష్ప, అలంకార, ఔషధ మొక్కలను ఆధునిక పద్ధతుల్లో పెంచుతున్నారు. ప్రతి ప్రాంత అవసరానికి అనుగుణంగా జాతులను ఎంపిక చేసి విస్తృతంగా నాటేందుకు సిద్ధం చేశారు.

**ఉద్యోగి నుంచి విద్యార్థి వరకు అందరూ భాగస్వాములే..**

హరిత కార్యక్రమాన్ని కేవలం సంస్థ కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా మార్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.



అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, విద్యార్థులు అందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కకు బాధ్యత వహిస్తేనే పచ్చని భవిష్యత్ సాధ్యమవుతుందని చెబుతున్నారు.

**బొగ్గు తవ్వకాలతో పాటు ప్రకృతికీ సమాన ప్రాధాన్యం**

వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, గాలి కాలుష్యాన్ని నియంత్రించడం, భూగర్భ జలాలను పెంపొందించడం, జీవ వైవిధ్యాన్ని కాపాడడం వంటి లక్ష్యాలతో హరిత కార్యక్రమాలను విస్తరిస్తున్నారు. పారిశ్రామిక అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణ రెండూ కలిసి సాగాలని సింగరేణి భావిస్తోంది. అందుకే ప్రతి ఏడాది మొక్కల సంఖ్యను పెంచుతూ పచ్చదనాన్ని విస్తరిస్తోంది.

**జీఎం శ్రీనివాస్ మాటల్లో...**

శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఏరియాలో మొక్కలు నాటేందుకు సరిపడా మొక్కలను సిద్ధం చేశాం. రెండు లక్షలకు పైగా మొక్కలతో విస్తృత హరిత ప్రణాళికను అమలు చేస్తున్నాం. బొగ్గు తవ్వకాలు ఎంత ముఖ్యమో... భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతిని అందించడం కూడా అంతే ముఖ్యమని సింగరేణి విశ్వసిస్తోంది. ప్రతి మొక్క బతికేలా ప్రత్యేక సంరక్షణ చర్యలు చేపడుతున్నాం. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ప్రతి మొక్కకు రక్షణ కంచె, నీటి సదుపాయం మనుగడ శాతం పెంచేందుకు కృషి చేస్తాం.

# ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలి

**విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి**

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**



**నిర్మల్ ప్రతినిధి, జూలై 28(నినాదం):** ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వర్షపాతం తగ్గుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి పద్ధతులు అవలంబించేలా అవగాహన కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం సీఎస్ ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల సాగు, విపత్తుల నిర్వహణ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై సూచనలు అందించాలని తెలిపారు. తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల పంటలను ప్రోత్సహించాలని, రైతులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటలను మార్చుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి విపత్తులు సంభవించినా వెంటనే స్పందించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విపత్తులు సంభవించినప్పుడు చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ భవేశ్ మిశ్రా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సీపీఓ గంగారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో ఆర్జీ-2కు ఆరు అవార్డులు పంట

**భద్రత, పర్యావరణ పరిరక్షణలో అత్యుత్తమ ప్రతిభకు గుర్తింపు**

**డిజీఎంఎస్, సింగరేణి సంస్థ డైరెక్టర్స్ చేతుల మీదుగా ప్రైజెస్ అందుకున్న జీఎం**




**యైటింక్లయిన్ కాలనీ, జులై 28 (నినాదం):** సింగరేణి సంస్థలో భద్రతా ప్రమాణాల అమలు, పర్యావరణ పరిరక్షణ, ప్రమాదరహిత ఉత్పత్తిలో రామగుండం-2 ఏరియా మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. సంస్థవ్యాప్తంగా నిర్వహించిన 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో ఆర్జీ-2 ఏరియా ఏకంగా ఆరు ప్రతిష్ఠాత్మక అవార్డులను కైవసం చేసుకుని విశిష్ట విజయాన్ని నమోదు చేసింది. 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాల ముగింపు వేడుకల్లో డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీజీఎంఎస్) ఉజ్వలధా ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సింగరేణి డైరెక్టర్స్ ఎల్.వి సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లు, తిరుమలరావు, సీఏజీఎం (సేఫ్టీ) సాయిబాబులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రామగుండం--2 ఏరియా జనరల్ మేనేజర్ బండి వెంకటయ్య, ఎస్.ఓ.టు జీఎం మాలోత్ రాముడు, అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు డీజీఎంఎస్, సంస్థ డైరెక్టర్స్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఏరియాకు లభించిన బహుమతుల్లో వకీల్‌పల్లి అండర్‌గ్రౌండ్ గని గ్రూప్-1లో ప్రథమ బహుమతి, ఆర్జీ ఓసీపీ-3 ఓపెన్‌కాస్ట్ మైన్స్ గ్రూప్-1లో ద్వితీయ బహుమతి, ఆర్జీ ఓసీపీ-3 వర్క్‌షాప్ విభాగంలో తృతీయ బహుమతి, ఆర్జీ ఓసీపీ-3 సీహెచ్‌పీకి బెస్ట్ ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ సీహెచ్‌పీగా ప్రథమ బహుమతి, ఫస్ట్ ఎయిడ్ విభాగంలో ప్రథమ బహుమతి, అలాగే వకీల్‌పల్లి గని హెడ్ ఓవర్‌మన్ టి. బానయ్యకు 'యాక్సిడెంట్ ఫ్రీ వర్క్‌మన్' అవార్డు లభించాయి. ఈ సందర్భంగా జీఎం బండి వెంకటయ్య మాట్లాడుతూ భద్రతా ప్రమాణాల అమలు, పర్యావరణ పరిరక్షణ, ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఉద్యోగులు, కార్మికులు సమిష్టిగా చేసిన కృషికి గుర్తింపుగానే ఈ అవార్డులు లభించాయని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ప్రతిష్ఠాత్మక పురస్కారాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జీఎం మాలోత్ రాముడు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ బీవీ సత్యనారాయణ, సీహెచ్‌పీ హెచ్‌ఓడీ బాలాజీరావు, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం రాంరెడ్డి, వకీల్‌పల్లి గ్రూప్ ఆఫ్ మైన్స్ ఏజెంట్ నెహ్రూ, ఓసీపీ-3 ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉదయ్ హరిజన్, వకీల్ పల్లి మైన మేనేజర్ మల్లేశం, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, అర్జీ-2 బ్రాంచ్ సెక్రటరీ గంధం సాంబాశివరావు, వకీల్ పల్లి మైన్ పిట్ సెక్రటరీ బొంత రాజు, రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మన్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణ రెడ్డి, సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య, ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ యాదగిరి నరేష్ లతో పాటు వివిధ యూనియన్ల నాయకులు, విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# హెపటైటిస్ అవగాహనతో నివారణ

**డాక్టర్ దామెర రాములు ఎం డి**


**తెలంగాణ రాష్ట్ర ఎండి అండ్ ఫిజీషియన్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్**




**నిర్మల్ ప్రతినిధి, జులై 28 ( నినాదం):** హెపటైటిస్ వ్యాధిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతోపాటు, వ్యాధి నిరోధక చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఎండీ అండ్ ఫిజీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎలెక్ట్ డా. దామెర రాములు అన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. దామెర రాములు మాట్లాడుతూ.. హెపటైటిస్ ప్రధానంగా ఏ, బీ, సీ, డీ, ఈ వైరస్‌ల వల్ల సోకుతుందని తెలిపారు. కలుషిత నీరు, కలుషిత ఆహారం, రక్త మార్పిడి, ఇతర మార్గాల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ఇది కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. హెపటైటిస్ బీ వ్యాధికి సమర్థవంతమైన టీకా అందుబాటులో ఉందని, చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ వ్యాధి నివారణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య రంగాల సమన్వయంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అర్హులైన వారికి టీకాలు అందించడం ద్వారా హెపటైటిస్‌ను నియంత్రించవచ్చని అన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డా. ప్రశాంత్ వాగ్మరే, కోశాధికారి డా. మహేష్ బాబు, డా. దయాకర్, నర్సింగ్ సిబ్బంది, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రేపు ఎల్లుండి భారీ వర్షాలు

**కలెక్టర్ కోయ శ్రీహర్ష సుచన...**




**పెద్దపల్లి రూరల్,జూలై - 28(నినాదం):** వాతావరణ నిపుణులు, క్లైమటాలజిస్టులు అందించిన నివేదికల ప్రకారం పెద్దపల్లి జిల్లాలో 2026 జూలై 28,29 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు,కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా కంది, పెసర, నువ్వులు, పొద్దుతిరుగుడు, అలసంద, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు వంటి పంటలను సాగు చేయడం ద్వారా మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు విత్తనాలు వేసేందుకు అత్యంత అనుకూల సమయమని, జిల్లా కలెక్టర్ సూచించారు. సకాలంలో విత్తనాలు వేయడం వల్ల నేలలో తగినంత తేమ లభించి పంటలు ఆరోగ్యంగా ఎదిగి మంచి దిగుబడులు వచ్చే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆగస్టు 10 వరకు మోస్తరు వర్షాలు కురిసినప్పటికీ అవి చెరువులు నిండేందుకు,భూగర్భ జలాలు పెరిగేందుకు ఉపయోగపడవని, వీటిని నమ్ముకుని వరి వంటి పంటలు వేస్తే రైతులు దెబ్బతింటారని ఆరుతడి పంటల సాగుకే రైతులు మొగ్గు చూపాలని కలెక్టర్ సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ ఈ అనుకూల వర్షాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# రోడ్లపై పశువులు.. ప్రాణాలతో చెలగాటం..!

**మంచిర్యాల, జూలై 28 (నినాదం):** ఉదయం ఇంటి నుంచి ఉద్యోగానికి, వ్యాపారానికి లేదా పాఠశాలకు వెళ్లిన వ్యక్తి సాయంత్రం క్షేమంగా తిరిగి వస్తాడనే నమ్మకం రోజురోజుకూ తగ్గిపోతోంది. ఇందుకు ప్రధాన కారణాల్లో రోడ్లపై స్వేచ్ఛగా సంచరిస్తున్న పశువులు కూడా ఒకటిగా మారాయి. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు, కాలనీల వీధుల్లో పశువులు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రతి ప్రయాణం ప్రాణాలతో చేసే సాహసంగా మారుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. వేగంగా వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా పశువు అడ్డంగా రావడంతో దానిని తప్పించబోయి అదుపుతప్పి కిందపడుతున్న ఘటనలు జిల్లాలో తరచూ జరుగుతున్నాయి. పలువురు తీవ్రంగా గాయపడుతుండగా, మరికొందరు శాశ్వత వికలాంగులుగా మారుతున్నారు.

**ఒక్క ప్రమాదం... కుటుంబం మొత్తం రోడ్డున పడుతుంది...**

ప్రమాదంలో మరణించే వ్యక్తి ఒక్కరే అయినా, ఆ బాధ మాత్రం మొత్తం కుటుంబానిదే. తండ్రిని కోల్పోయిన చిన్నారులు, భర్తను కోల్పోయిన భార్య, కొడుకుని కోల్పోయిన వృద్ధ తల్లిదండ్రులు జీవితాంతం ఆ విషాదాన్ని మోస్తూనే ఉంటారు. కేవలం నిర్లక్ష్యంగా రోడ్లపై వదిలేసిన పశువుల వల్ల ఒక కుటుంబం జీవనాధారాన్ని కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యను చిన్నదిగా చూడరాదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రాత్రివేళ మరింత ప్రమాదకరం..**

పగటి కంటే రాత్రి సమయంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటుంది. వీధి దీపాలు సరిగా లేకపోవడం, నల్లని రంగులో ఉండే పశువులు కనిపించకపోవడంతో వాహనదారులు చివరి క్షణంలో మాత్రమే వాటిని గుర్తిస్తున్నారు. అప్పటికే ప్రమాదం జరిగిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. వర్షాకాలంలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. పశువుల యజమానులు వాటిని స్వేచ్ఛగా రోడ్లపై వదిలేయడం వల్ల అవి రహదారులనే మేత భూము లుగా మార్చుకుంటున్నాయి. చెత్తకుప్పల వద్ద ఆహారం కోసం గుమిగూడడం, రహదారి మధ్యలోనే పడుకోవడం, ట్రాఫిక్‌కు అడ్డంకిగా నిలవడం సాధారణ దృశ్యంగా మారింది. దీంతో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు వంటి అత్యవసర సేవలకు కూడా ఆటంకం కలుగుతోంది.



**చర్యలు తీసుకుంటేనే మార్పు**

స్థానిక సంస్థలు, పశుసంవర్ధక శాఖ, పోలీసులు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. రోడ్లపై తిరిగే పశువులను పట్టుకొని గోశాలలకు తరలించడం, యజమానులపై జరిమానాలు విధించడం, పదేపదే ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

ప్రజల ప్రశ్నలకు సమాధానం ఎవరు చెబుతారు..?

ప్రతి ప్రమాదం తర్వాత అధికారులు స్పందించడం, హామీలు ఇవ్వడం పరిపాటిగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత పరామర్శలు చేయడం కంటే, ముందే నివారణ చర్యలు తీసుకుంటే ఎన్నో ప్రాణాలు కాపాడవచ్చని వారు సూచిస్తున్నారు. రోడ్లపై పశువులు తిరుగుతున్న విషయం అందరికీ కనిపిస్తుంటే... వాటిని తొలగించే బాధ్యత ఎవరిది? అమాయకులు ప్రాణాలు కోల్పోయిన తర్వాత బాధ్యత ఎవరు తీసుకుంటారు?" అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

**రోడ్లపై పశువులు లేకుండా చర్యలు తీసుకోవాలని వినతి..**

మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువుల కారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు



మంగళవారం మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, చేరాల వంశీ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన రహదారులపై, ముఖ్యంగా రాత్రి వేళల్లో యజమానులు నిర్లక్ష్యంగా పశువులను వదిలివేయడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అకస్మాత్తుగా రహదారిపైకి వచ్చే పశువులను తప్పించబోయే క్రమంలో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, ఫలితంగా అనేక మంది తీవ్రంగా గాయపడటమే కాకుండా కొందరు ప్రాణాలు కూడా కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ భద్రతకు ముప్పుగా మారిన ఈ సమస్యను నగరపాలక సంస్థ అత్యవసరంగా పరిగణించాలని వారు కోరారు. రోడ్లపై పశువులను వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నగరంలో సంచరిస్తున్న పశువులను గుర్తించి ప్రత్యేక గోశాలలు లేదా నిర్దేశిత ప్రదేశాలకు తరలించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, ప్రజల ప్రాణాలను కాపాడేలా నగరపాలక సంస్థ వెంటనే స్పందించాలని విద్యార్థి సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రజా భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# స్కాలర్‌షిప్‌ల కోసం నిరీక్షణ.. చదువులపై చీకట్లు



**మంచిర్యాల, జూలై 28 (నినాదం):** స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్య కలలు ప్రశ్నార్థకంగా చెదిరిపోతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ యువమోర్చా చేపట్టనున్న "ఫీజుల బకాయి - బీజేపీ లడాయి" రాష్ట్రవ్యాప్త ఆందోళన పోస్టర్‌ను మంగళవారం మంచిర్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులే తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. స్కాలర్‌షిప్‌లు రాక కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో పలువురు విద్యార్థులు ఉన్నత విద్యలో చేరే అవకాశాలను కోల్పోతున్నారని తెలిపారు. కొందరు విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, మరికొందరు అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్మించాల్సిన ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించిన వెంకటేశ్వర్ గౌడ్, విద్య హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యువతతో కలిసి జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తు రాజకీయాలకు బలి కాకూడదని, ప్రతి అర్హ విద్యార్థికి సమయానికి స్కాలర్‌షిప్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, యువమోర్చా జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు నివేదికలు సమర్పించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి



**మంచిర్యాల, జూలై 28 (నినాదం):** పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష రాసినప్పటికీ గైర్హాజరైనట్లు నమోదు చేసి విద్యార్థిని అంజమ్మను తీవ్ర మనోవేదనకు గురిచేశారని ఆరోపిస్తూ ఏఐఎస్బీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల సన్ని గౌడ్ మాట్లా డుతూ, విద్యార్థిని పరీక్ష రాసినట్లు విచారణలో తేలి మెమో జారీ చేసిన అనంతరం కూడా బాధ్యులపై చర్యలు లేకపోవడం బాధాకరమన్నారు. పరీక్షా కేంద్రంలో జరిగిన నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చేందుకు తప్పుడు నివేదికలు సమర్పించిన చీఫ్ సూపరింటెండెంట్, కోఆర్డినేటర్, ఇన్విజిలేటర్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌లపై కఠిన చర్యలు తీసుకుని, విద్యార్థినికి పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థి చదువుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లి, జిల్లా అధ్యక్షుడు జతిన్, నాయకులు ఈశ్వర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు, ఎక్స్ గ్రేషియా అమలు చేయాలి

**మంచిర్యాల, జులై 28 (నినాదం):** ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపసర్పంచ్‌ల ఫోరం ప్రతినిధులు మంగళవారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ



సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అనుమండ్ల విక్రమ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపసర్పంచ్‌లకు నెలకు రూ. 5,000, వార్డు సభ్యులకు రూ. 3,000 వేతనం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన లేదా గాయపడిన సందర్భాల్లో ఉపసర్పంచ్‌లకు రూ. 5 లక్షలు, వార్డు సభ్యులకు రూ. 3 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని కోరారు. అలాగే గ్రామాల్లో ఏర్పాటు చేసే శిలాఫలకాలపై ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల పేర్లను కూడా పొందుపర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రవీందర్, ఉపాధ్యక్షురాలు స్రవంతితో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపసర్పంచ్‌లు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.